
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ మాసపత్రిక

AUGUST 2007

సంవత్సర చందా రూ. 50/-

## క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

### సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్సా' ఛానల్ లో ఉదయం 7:00 గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం 7:00గం॥లకు,సాయంత్రం 5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి

2007 సెప్టెంబరు నుండిప్రతి సోమవారం నుండిశనివారం వరకు : శుభవార్త ఛానల్‌లో ఉదయం 6:00 గంటలకు చూడండి.

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | ఆగష్టు 2007 | సంచిక 1


## దేవుడు సర్వాంతర్యామి, సర్వజ్ఞాని

(God is Omnipresent and Omniscient)

గత పాఠంలో దేవుడు సర్వశక్తిమంతుడు అనే అంశాన్ని ధ్యానించాము. దేవుడు సర్వశక్తిమంతుడే కాదు; ఆయన సర్వాంతర్యామి, సర్వజ్ఞాని యని కూడా బైబిలు బోధించుచున్నది. ఆయన ఒక స్థలానికి సమయానికి పరిమితమైన వాడు కాదు. దేవుడు సర్వాంతర్యామి అనగా ఆయన ఈ విశ్వమంతటిలోను ఒకే సమయమందు వ్యాపించి యున్నవాడు. ఆయన ఈ విశ్వానికి అతీతుడు. ఆయన అన్నిచోట్ల ఒకే సమయమందుండు వాడు.

ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాదు (అపో.కా. 17:27). ఆయన మనకెంత సమీపముగానున్నాడో, అదే సమయములో పశ్చిమార్ధ గోళములో యున్నవారికి అంతే సమీపముగా నున్నాడు.

"నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరమున

నుండు దేవుడనుకానా? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా - నాకు కనబడకుండ రహస్య స్థలములో దాగగల వాడెవడైనను కలడా? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా? యిదే యెహోవా వాక్కు" అని ఆయన యిర్మీయా ప్రవక్త ద్వారా ప్రకటించెను (యిర్మీయా 23:23-24). ఆయన పని చేయడానికి, లేక మన ప్రార్ధనలు వినడానికి ఒకచోట నుండి మరొక చోటికి వెళ్లనవుసరము లేదు. సర్వసృష్టియంతటను ఆయన ఆవరించియున్నాడు. ఈ లోకంలో నీవెక్కడ యున్నను ఆయనకు సమీపముగానే యుంటావు. అందువలన దేవుని సాన్నిధ్యము పొందాలంటే తీర్థయాత్రలు వగయిరా చేయనవుసరం లేదు. గాని వినయము, విధేయత మారుమనస్సు ఉంటే ఆయన సన్నిధికి చేరుకోగలవు.

**పరిమితి లేనివాడు**

దేవుడు సర్వాంతర్యామి గనుక ఆయనను ఒక స్థలమునకు పరిమితము చేయలేము. కొందరు గుడులు, గోపురాలు కట్టి అందులో దేవుణ్ణి వుంచామనుకొంటారు. అది అసంభవము. సొలొమోను మహారాజు యెరూషలేములో దేవాలయమును నిర్మించినను, దేవుణ్ణి దాంట్లో బంధించగలనను కోలేదు. సరిగదా, ఆ ఆలయాన్ని ప్రతిష్ట చేస్తూ "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు; ఆకాశ మహాకాశములు సయితము నిన్ను పట్టజాలవు; నేను కట్టించిన ఈ మందిరము ఏలాగు పట్టును?" అని ప్రార్థించాడు (1 రాజులు 8:27). దేవుడు ఆత్మ గనుక ఆయనను ఒక గుడికో లేక కొండకో పరిమితము చేయలేమని యేసు ప్రభువు కూడా బోధించారు (యోహాను 8:24). ఆయన అన్నిచోట్ల ఒకే సమయమందున్నవాడు, సర్వాంతర్యామి !!

దేవుడు, ఈ విశ్వాన్నంతటికి పైగా యున్నవాడు. ఆయన సర్వోత్కృష్టమైన వాడు. ఆయన సర్వాంతర్యామి. దేవుడు ఈ విశ్వానికి పైగా యున్నవాడైనను, ఈ విశ్వం అంతటిలోను అంతర్భూతమైన వాడు(He is Immanant). ఎక్కడో దూరాన్నవుంటూ ఆయన ఈ విశ్వంలో అటు యిటు చలించడు. "అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోన

వ్యాపించి అందరిలోను ఉన్నాడు" (ఎఫెసీ 4:6).

దేవుడు ఈ విశ్వం అంతటిలోను వ్యాపించి యున్నవాడైనను, అంతగంభీరుడైనను మనలో, మనతో నివసించగలడు. "మహాఘనుడును, మహోన్నతుడును పరిశుద్ధుడును, నిత్యనివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు: నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను. అయినను వినయము గలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును,నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపచేయుటకును వినయముగలవారి యొద్దను, దీన మనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాను" అని ఆయన యెషయా ద్వారా సెలవిచ్చారు (యెషయా 57:15). అందుకే దైవజనుడైన మోషే యిట్లు ప్రార్థించాడు : "ప్రభువా, తర తరముల నుండి మాకు నివాసస్థలము నీవే: పర్వతములు పుట్టకమునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములు నీవే దేవుడవు" (కీర్తన 90:1-2). ఆయన నిత్యము వున్నవాడు, నిత్యము ఉండువాడు. కాలముతో నిమిత్తము లేనివాడు. ఆయన గతంలో యున్నవాడు, ప్రస్తుతము వున్నవాడు, భవిష్యత్తులో వుండువాడు. ఆయన ఉండు ననువాడైయున్న దేవుడు. యెహోవా దేవుడు (నిర్గమ 3:14).

## ఆయన నుండి పారిపోలేము

దేవుడు సర్వాంతర్యామి యైనవాడు గనుక ఆయన నుండి పారిపోలేము, ఆయన నుండి దాగుకొనలేము. "నీ ఆత్మ యొద్ద నుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును, నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. అంధకారము నన్ను మరుగుచేయును నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు

వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి" యని దావీదు చెప్పాడు (కీర్తన 139:7-12).

దేవుడు సర్వాంతర్యామి యైనప్పుడు సహజంగా ఆయన సర్వజ్ఞానియే. ఆయన అందరి దగ్గరా ఉన్నవాడు, ఎవనికి దూరమైనవాడు కాదు గనుక ఆయన అందరిని అంతటిని ఎరిగినవాడు. ఆయన పరిపూర్ణ జ్ఞాని. దావీదు139 కీర్తన ఆరంభములో ఇట్లు చెప్పుచున్నాడు : "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొనియున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను, నా పడకనునీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందునునీవు నన్ను ఆవరించియున్నావు. నీ చేయి నా మీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము, అది నాకందదు" (కీర్తన 139:1-6).

దేవుడు ఈ విశ్వమంతటిలోను, నిత్యత్వములోను అన్నిచోట్లయున్న వాడు. మనము ఆయనకు కనబడకుండా ఎక్కడా యుండలేము. ఆయనకు తెలియకుండా యేమీ చేయలేము. ఏలయనగా ఆయన లేనిచోటు లేనేలేదు. ఆయన సమస్తమును ఎరిగినవాడు. తన్ను గూర్చి తానును ఎరిగివాడు. ఆయన సర్వజ్ఞాని.

మానవ జ్ఞానము అసంపూర్ణమైనది. దేనిని మనము పరిపూర్ణముగా గ్రహించినవారము కాము. మన జ్ఞానము పరిమితమైనది గనుక అపరిమిత జ్ఞానియైన దేవుని పూర్ణముగా గ్రహించుకొనలేము. ఈ లోకంలో జీవించిన మేధావులందరి జ్ఞానము కలిపి దేవుని జ్ఞానముతో సమానము కాజాలదు. "దేవుని వెర్రితనము మనుష్యుల జ్ఞానము కంటె జ్ఞానము కలది. దేవుని బలహీనత మనుష్యుల బలము కంటే బలమైనది" (1కొరింథీ 1:24). దేవుడు గతాన్ని గూర్చి, ప్రస్తుతాన్ని గూర్చి, భవిష్యత్తును గూర్చి పరిపూర్ణ జ్ఞానము గలవాడు (అపో.కా. 15:17). "ప్రభువా, నీవు

సమస్తమును ఎరిగినవాడవు" అని పేతురు చెప్పాడు (యోహాను 21:17). "ఆయన భూమ్యంతరముల వరకు చూచుచున్నాడు. ఆకాశము క్రింది దానినంతటిని తెలిసి కొనుచున్నాడు" అని దేవుని గూర్చి యోబు పలికాడు (యోబు 28:24). ఆకాశ నక్షత్రములను గూర్చి చెబుతూ ప్రవక్తయైన యెషయా యిట్లు వ్రాసాడు: "మీ కన్నులు పైకెత్తి చూడుడి, వీటిని ఎవడు సృజించెను? వీటి లెక్క చొప్పున వీటి సమూహములను బయలుదేరజేసి వీటన్నిటికిని పేరులు పెట్టి పిలుచువాడే గదా" (యెషయా 40:24). దేవుడు ఈ విశ్వాన్నంతటినీ ఎరిగినవాడు.

దేవుడు మానవుని గూర్చి సమస్తమును ఎరిగినవాడు, గతంలో జరిగిన దానిని ఆయన ఎరిగి యుండుటయే గాక, నాటి పరిస్థితులు వేరుగా యుంటే యేమి జరిగియుండేదో కూడ ఆయనకుతెలుసు. యేసు కాలము నాటి ప్రజలమధ్య చేయబడిన సూచకక్రియలు గనుక తూరు, సీదోను పట్టణములలో చేయబడిన యెడల,ఆ పట్టణములవారు మారు మనస్సు పొంది యుందురని ఆయన చెప్పారు. (మత్తయి 11:24). మానవునిలో యేమివున్నదో దేవుడెరుగును. "ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియులేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగాయున్నది" (హెబ్రీ 4:13). పరలోక తండ్రి సెలవులేకుండా ఒక్క పిచ్చుకయైనను నేలనుపడదని, మన తల వెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 10:29,30). "మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియునని" కూడా ఆయన చెప్పారు (మత్తయి 6:8). ఆయన సర్వజ్ఞాని.

అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవమని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 17:3).యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామెతలు 1:7). "యెహోవా యందు భయభక్తులు గలిగి యుండుటయే

జ్ఞానమునకు మూలము, పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము" (సామె 9:10). మనము దేవునికి దగ్గరగా జీవించుచున్న యెడల ఆయన జ్ఞానమే మనకు ఆదరణ. ఆయన నిన్ను, నన్ను, నీ అవుసరములను, నా అవుసరములను ఎరిగినవాడు. మన ఆత్మలను రక్షించువాడు. మనం యేసు ప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల మనలను రక్షించి తన సంఘముతో చేర్చుకొనును, నిత్యజీవార్థమైన జ్ఞానమును ప్రసాదించును !!

## సంఘ సంగీతము

(Music in the Church)

సంఘ ఆరాధనను గూర్చి మనము ఇంతకుముందే చదివియుంటిమి. దానిలో ప్రార్ధన చేయుట, పాటలు పాడుట, వాక్యపఠనము చేయుట, ప్రభురాత్రి భోజనములో పాలు పుచ్చుకొనుట మరియు కానుకలిచ్చుట యనునవి దానియందు మిళితమై యున్నవని గమనించితిమి. అయితే ఇప్పుడు దేవుడు సంఘములో కోరునట్టి సంగీతమగు పాటలు పాడుటను కొంత విపులముగ పఠించుదము. ఈ అంశమును మనము విపులముగ ఎందుకు చదువవలెనంటే రెండు రకములైన సంగీతములున్నవి: అవి గాత్రము (Vocal) జంత్రము (Instrumental) అనునవి. అందువలన ఆరాధనలో ఈ రెండు రకములైన సంగీతములను వినియోగించవచ్చునని గాని లేక పాటలు పాడుటనే (గాత్రమునే) జరిగించవచ్చునని గాని బైబిలు దీని విషయమై ఏమి బోధించుచున్నదో మనము నిర్ణయించవలెను.

మొదటిగా, క్రీస్తు సంఘములో మొదటి శతాబ్దములో వాయిద్య సంగీతము ఉపయోగింపబడినట్లు అగుపడు ఆజ్ఞలుగాని మాదిరి గాని క్రొత్త నిబంధన లేఖనములలో ఎక్కడను కన్పడుట లేదు. సరిగదా మొదటి శతాబ్దములో గాని దాని తరువాత గాని క్రైస్తవులు ఆరాధనలో వాయిద్యములను వినియోగించి నట్లు

చారిత్రాత్యకబుజువులు ఏమియును లేవు. అయితే క్రైస్తవులు పాటలు పాడవలెనని ఆజ్ఞాపింపబడినట్లు లేఖనములు తెలియజేయుచున్నవి. అట్టికొన్ని వచనములను ఇప్పుడు గమనించుదము:

1. అపో.కా. 16:25: "అయితే మధ్య రాత్రివేళ పౌలును సీలయు దేవుని ప్రార్థించుచు కీర్తనలు పాడుచునుండిరి"

2. రోమా 15:9: "ఈ హేతువు చేతను అన్యజనులలో నేను నిన్ను స్తుతింతును; నీ నామ సంకీర్తనము చేయుదును" అని వ్రాయుబడి యున్నది.

3. 1కొరింథీ 14:15 "కాబట్టి ఆత్మతో ప్రార్థనచేతును, మనస్సుతోను ప్రార్థన చేతును, ఆత్మతో పాడుదును,మనస్సుతోను పాడుదును".

4. ఎఫెసీ 5:19 "ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి".

5. కొలస్స 3:16: "సంగీతములతోను, కీర్తనలతోను, ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు బుద్ధి చెప్పుచు, కృపానహితముగా మీ హృదయములలో దేవుని గూర్చిగానముచేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి".

6. హెబ్రీ 2:12: "నీ నామమును నా సహోదరులకు ప్రచుర పరతును, సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును".

7. యాకోబు 5:13: " మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా ? అతడు ప్రార్థన చేయువలెను; ఎవనికైనను సంతోషము కలిగెనా? అతడు కీర్తనలు పాడవలెను".

పైన చెప్పబడిన వచనములలో వాయిద్యములను గూర్చి ఏమియు చెప్పబడలేదని దయచేసి గమనించుము. ఎందువలన? ఇదొక మంచి ప్రశ్న. ఈ వచనములో ఏమి చెప్పబడెనో దానినే ప్రభువు ఆయన తన సంఘమును చేయువలెనని కోరుచున్నట్లు ఋజువగుచున్నది. అదేమనగా మనమాయనను ఆరాధించునపుడు పాటలు పాడవలెను. దేవుడు యాంత్రిక సంగీతమును ఆజ్ఞాపింపలేదు. దాని విషయమై లేఖనములు మౌనముగా యున్నందున వాటిని వినియోగించు స్వాతంత్ర్యము మనకు లేదని నిరూపణ యగుచున్నది. మానవ సృష్టియైన వాయిద్యములతో దేవుని మనము ఆరాధించవలెనని మనకు చెప్పబడలేదు. సరిగదా దైవసృష్టి దేవుని స్తుతించవలెనని దేవుడు కోరుచున్నాడు. మనము హృదయపూర్వకముగా భావనా ప్రేరితమైన పాటలతో ఆత్మతో ఆయన ఆరాధించవలెనని ఆయన

నిన్ను నన్ను కోరుచున్నాడు; దానికంటే తక్కువైన దానిని ఆయన అంగీకరించడు.

పైన చూచిన వచనములో అనేక ప్రాముఖ్య సంగతులను నీవు గమనించగలవు:

1. స్తుతి గానములు దేవునికి అర్పించవలెను. సంతోషపడవలసినది ఆయనేగాని. నీవు.నేను లేక యితరులు కాదు. వాయిద్యసంగీతము నుపయోగించువారు అది వారి కిష్టమైనందున ఉపయోగింతురు గాని బైబిలు దాని విషయమై బోధించుచున్నదని కాదు.

2. పాటలు దేవుని నామమున పాడవలెను, అనగా ఆయన అధికారము చొప్పున చేయబడవలెను.

3. పాటలు ఆత్మతోను, అర్ధముతోను పాడవలెను. ప్రతి ఒక్కరును ఆత్మతో, అనగా వినయముతో, భక్తితో, నిష్కాపట్యముతో పాడవలెను. ప్రతి ఒక్కరును అర్ధముతో అనగా పాడుచున్న పాటయొక్క భావమును గ్రహించుకొని పాడవలెను.

4. గీతములు, కీర్తనలు,ఆత్మసంబంధమైన పద్యములు వినియోగించవచ్చును. రకరకాల పాటలుండవచ్చును గాని అవన్నియును వాక్యానుసారముగ యున్నఆత్మీయ గీతములై యుండవలెను.

5. ఈ పాటల ద్వారా ఒకరికొకరు బోధించుకొనుట జరుగవలెను; అనగా ప్రతి పాటలోను ఒక సందేశము ఇమిడి యుండవలెను. అందువలన ఈ ఆరాధన క్రియలో ప్రతి ఒక్కరు పాలు పొందుట అత్యవసరము.

6. దేవుని గూర్చి హృదయములో గానము చేయవలెను. మన స్వరపేటికయే ఒక వాయిద్యము. స్వరపేటిక ద్వారా శబ్దము వచ్చుచుండగా మన హృదయములో లేక మనస్సులోగానము చేయవలెను.

7. సంఘమంతయు కలసి పాడవలెను. అందువలన ఏకకంఠ గాయకులు, యుగళ గాయకులు నీ కొరకు, నాకొరకు పాడలేరు.

హెబ్రీయులకు వ్రాసిన లేఖకుడు వ్రాసిన దానిని మనస్సు నందుంచుకొనుము; కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు జిహ్వాఫలము అర్పించుదము" (హెబ్రీ 13:15). వాయిద్య సంగీతము నుపయోగించువారు అనేక విధములుగ వాదింతురు గాని వారి వాదనలో ఏదియును బైబిలు ఎదుట నిలువలేదు. ప్రతివారు తమకిష్టము వచ్చినట్లు ఆరాధించవచ్చునని వారు వాదించుటలో వారి వాదన యొక్క బలమంతయు పోగొట్టుకొందురు. వాయిద్యములు లేకుండ కూడా దేవుని నారాధించవచ్చునని వారు ఒప్పుకొందురు. గనుక ఒకడు

వాయిద్యములు లేకుండ ఆరాధించ వచ్చుననినప్పుడు వాయిద్యములను ఎందుకు విడనాడకూడదు? అట్లుచేసి ఈ అంశముపై విభజన లేకుండ ఎందుకు ప్రయత్నించరాదు?

దేవుని ఆరాధనలో వాయిద్యములకు ఏమాత్రమును తావులేదని అనేక మతశాఖల నాయకులగు మార్టిన్ లూథరు, జాన్‌వెస్లీ మొదలగువారు బహిరంగముగా ప్రకటించిరి. ఈ అంశముపై బైబిలు ఏమి చెప్పుచున్నదో ఈనాటి మత ప్రపంచము విననేరక పోయిన యెడల కనీసము వారి మత నాయకులు వాయిద్య సంగీతమును గూర్చి ఏమి చెప్పిరో వినవచ్చునుగదా?

అందువలన సంఘ సంగీతము గాత్రమే (Vocal Music). దేవుడు మాట్లాడెను. ఆయన కోరునది యేదో దానిని ఆయన బయలుపరచెను. ఇది తప్ప వేరొక నిర్ణయమునకు మనము రాలేము. ఈ అంశముపై మనము ఆయన వాక్యమునకు కలుపుటగాని, తీసివేయుటగాని లేదా దానిని మార్చివేయుట గాని చేయరాదని ప్రభువు మనలను హెచ్చరించెను (ప్రకటన 22:18,19; గలతీ 1:6-9). నరిగదా మనములేఖనములను అతిక్రమించరాదు (2యోహాను : 9). అందువలన దేవుడు ఆరాధనలో దేనిని ఇమిడ్చెనో దానితోనే మన ఆరాధన జరిగించుటలో తృప్తినొందవలెను.

– జె.సి. ఛోట్

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి కార్యక్రమములను

ప్రతి మంగళవారం ఉదయం 6:30 గంటలకు మాటీవీలోను

శనివారం ఉదయం 6:30 గంటలకు తేజ ఛానల్‌లోను

గురువారం ఉదయం 7 గంటలకు విస్సా ఛానల్‌లోను చూడండి.

# ప్రార్థన శక్తి
## (The power of Prayer)

పరిచయము: ప్రకటన 8వ అధ్యాయము చదువుము

ప్రకటన 5 నుండి 7 వరకు వున్న అధ్యాయాలలో ఏడు ముద్రలు వేయఃబడిన గ్రంథముండెను. ఆ ముద్రలు ఒక్కొక్కటి విప్పబడుట మనము చూచియుంటిమి. ఏడోవ ముద్ర విప్పబడినప్పుడు ఏడు బూరలు పరిచయం చేయబడ్డాయి.

1. ఆ ఏడు ముద్రలు యేమి బయలుపరుచునో అదే సంగతులను ఆఏడు బూరలు కూడ బయలుపరచును. మొదట చూపబడిన దృశ్యములనే ఇంకో కోణములో మనం చూడ బోవుచున్నాము. తరువాత ఏడు పాత్రలను గూర్చి చెప్పబడును. అవి కూడ ఏడు ముద్రలు, ఏడుబూరలు యేమి బయలుపురచెనో వాటిని గూర్చియే ఇంకో కోణములో మనకు బయలుపర్చును.

2. ఈ ఏడు బూరలు ఊదబడుచుండగా,వాటిలో యున్న నమూనాను మనం గమనించాలి. మొదటి నాలుగు బూరలు ప్రకృతి శక్తులకు సంభవించును. ఆఖరి మూడు మనుష్యులకు సంభవించును. యిదే మాదిరి ఏడు ముద్రలు విప్పబడుటలో కూడ కన్పడును.

### I ఏడవముద్ర విప్పబడుట (1-2వ)

A. “ఆయన ఏడవముద్రను విప్పినప్పుడు పరలోకమందు ఇంచుమించు అరగంట సేపు నిశ్శబ్దముగా ఉండెను”.

ఇది గొప్ప ప్రళయము సంభవింపకముందు కనబడే నిశ్శబ్దము, పరిశుద్ధుల ప్రార్థనలు పరలోకమునకు ఎక్కుచుండగా అక్కడ నిశ్శబ్దత యుండుట సహజమే. ఈ నిశ్శబ్దము తురువాత సంభవించే దృశ్యమునకు ఉపోద్ఘాతము.

B. తురువాత దేవుని యెదుట నిలుచు ఏడుగురు దూతలను యోహాను చూచెను. వారికి ఏడు బూరలియ్యబడెను.

C. అత్యున్నత వ్యక్తుల ఆగమనానికి ముందు బూరలు ఊదేవారు. మరియు హెచ్చరిక చేయుడానికి లేదా యుద్ధానికి పిలువడానికి బూరలు ఊదబడుచుండేవి, ఈ ప్రత్యేక సందర్భములో రాబోవుచున్న విపత్తులను గూర్చి హెచ్చరించడానికి అవి వాడబడెను.

D. మరియు సువర్ణ ధూపార్తి చేత పట్టుకొనియున్న వేరొక దూత 3వ వచనములో కనబడును. పరిశుద్ధుల ప్రార్ధనలతో కలుపుటకై అతనికి బహుధూప ద్రవ్యములు ఇయ్యబడెను. పరిశుద్ధుల ప్రార్ధనలతో కలిపి ఈ దూత విజ్ఞాపన చేయుచుండెను. మన సహాయం నిమిత్తము క్రీస్తు, పరిశుద్ధాత్ముడు విజ్ఞాపన చేయుచుండిరి (హెబ్రీ 7:25; రోమా 8:26-27; 1తిమోతి 2:1-2).

E. ప్రకటన 6వ అధ్యాయములో 5వ ముద్రవిప్పబడినప్పుడు "దేవుని వాక్యము నిమిత్తమును తాము యిచ్చిన సాక్ష్యము నిమిత్తమును వధింపబడిన వారి ఆత్మలు బలిపీఠము క్రింద... నాథాసత్య స్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు మారక్తము నిమిత్తము భూ నివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని" దేవుని ప్రార్ధంచిరి (6:9-10). 8వ అధ్యాయములో వారి ప్రార్థినలకు జవాబీయ బడుట చూడగలము. 3వ వచనములో హింసింపబడుచున్నవారి ప్రార్ధనలు, పరిశుద్ధుల ప్రార్ధనలు, క్రీస్తు యొక్క విజ్ఞాపన దేవుని సన్నిధానమునకు. చేరుకొనుట చూడగలము:

1. యేసుక్రీస్తు దేవుని యెదుట మన కొరకు విజ్ఞాపన చేయుచున్నారు. " ఎవడైనను పాపముచేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు" (1యోహాను 2:1). "మృతులలో నుండి లేచినవాడును, దేవుని కుడిపార్శ్యమున ఉన్నవాడును, మనకొరకు విజ్ఞాపనము కూడ చేయువాడును ఆయనే" యని రోమా 8:34లో పౌలు చెప్పెను.

2. "ఈయన తన ద్వారా దేవుని యొద్దకు వచ్చువారి పక్షమున విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు" (హెబ్రీ 7:25).

I. "ఆ దూత ధూపార్తిని తీసికొని బలిపీఠముపైనున్న నిప్పులతో దానిని నింపి భూమిమీద పడవేయగా, ఉరుములు, ధ్వనులు మెరుపులు భూకంపమును కలిగెను" (5వ). పరిశుద్ధుల ప్రార్ధనలకు యిది దేవుని జవాబు. దేవుని ప్రజలు హింసింపబడుచున్నప్పుడు దేవుడు ప్రతిదండన చేయును, మనం ఎలుగెత్తి ప్రార్థించినప్పుడు దేవుడు తప్పక చర్యతీసికొనును, దేవుని ప్రతిదండనను ఇక్కడ యోహాను గొప్ప అలంకార భాషతో మనకు వర్ణించాడు.

## II బూరలు ఊదబడుట (8:6-13)

ప్రకటన 8వ అధ్యాయములో యేసు ప్రభువు అగ్నినే ప్రజలపై కురిపించుట కాదుగాని తన ప్రజల యొక్క ప్రార్ధనలకు దేవుని స్పందనను మనం చూడగలము.

A. "అంతట ఏడుబూరలు పట్టుకొనియున్న యేడుగురు దూతలు ఊదుటకు సిద్ధపడిరి" (6వ).

1. మొదటి బూర ఊదబడినప్పుడు రక్తముతో మిళితమైన వడగండ్లు పుట్టి భూమిపై పడవేయబడెను. భూమిలో మూడవ భాగము, చెట్లలో మూడవభాగము కాలిపోయెను. పచ్చగడ్డంతయు కాలిపోయెను. (నిర్గమ 9:23-25 చూడుము).

ఇంకోమాటలో ప్రకృతి వినాశము సంభవించెను.

2. రెండవ బూర ఊదబడినప్పుడు మండుచున్న అగ్నివంటి కొండ సముద్రములో పడవేయబడగా దాని మూడవ భాగము రక్తమాయెను. (నిర్గమ 7:20-21చూడుము). సముద్రములో ప్రాణము గల జంతువులు మూడవ భాగము చచ్చెను, ఓడలో మూడవ భాగము నాశనమాయెను. ఇంకో మాటలో ఉప్పునీటికి విపత్తు సంభవించెను. ఈ రీతిగా దేవుడు పరిశుద్ధుల ప్రార్ధనలకు జవాబుగా ప్రజలకు తీర్పు తీర్చుటకు మొదలిడెను. భూమిపై సంభవించు ప్రకృతి విపత్తులు, భయంకర సంఘటనల ద్వారా దేవుడు ప్రజలను హెచ్చరించుచున్నారు. అందు వలన మారుమనస్సు పొందేవారు కొందరుంటారు. మరికొందరు, నిజానికి అనేకులు దేవుని భయంకర శక్తిని,భూమిపై సంభవించే విపత్తులను చూచియు కూడ మారుమనస్సు పొందనొల్లరు.

3. మూడవ బూర ఊదబడినప్పుడు మండుచున్న యొక పెద్దనక్షత్రము ఆకాశమునుండి రాలి నదుల మూడవభాగమును నీళ్లబుగ్గల మీదను పడగా నీళ్లుచేదై మనుష్యులలో అనేకులు చచ్చిరి (10-11). ఇంకోమాటలో మంచినీటికీ విపత్తు సంభవించెను. ఇక్కడ యేమి సంభవించుచున్నది? దేవుని ఉగ్రతకు పాత్రులైన వారు తప్పించుకొనలేరు. భూమి, సముద్రములు, నదులు అన్నీ విపత్తునకు గురిచేయబడెను.

4. అంతట నాలుగవ బూర ఊదబడినప్పుడు సూర్యచంద్ర నక్షత్రములలో మూడవభాగము ప్రకాశింవకుండునట్లు వాటిలో మూడవభాగము కొట్టబడెను (12). ఇక్కడ వెలుతురు కలుగకుండునట్టి విపత్తు సంభవించెను. యిది ఐగుప్తు దేశమంతటను కమ్మిన చీకటిని మనకు గుర్తుచేయును (నిర్గమ 10:21-23).

a. యిది యేమి సూచించుచున్నది? దేవుని అంతిమ తీర్పుయిది కాదని సూచించుచున్నది. ప్రజలు దేవుని తెలిసికొనునట్లు ఆయన తీర్పులు లోకంలో ఈ రీతిగా బయలుపరచబడుచునే యుంటాయి. దేవుడే దేవుడని ఆయన తన ప్రజల

విజ్ఞాపనలకు స్పందిస్తారని ఈ వివత్తులన్నీ మనకు తెలియజేయుచున్నవి. యివి అనుభవించిన తరువాత మనం దేవుని తట్టుతిరగాలి. లేదా ఆయననుండి తప్పించుకొనలేము. (కీర్తన 139:7-10 చదువుము).

b. మరల దేవుడు తన వారిని ఎన్నడువిడువడనే నిర్ధారణ మనకు ఈ అధ్యాయంలో ఇయ్యబడినది. ప్రకటన 6:16-17లో దేవుని ప్రతిఘటించిన వారి స్థితి వర్ణించబడినది. వారు కొండ గుహలలోను బండసందులలోను దాగుకొని మీరు మామీద పడి ఆయన సన్నిధికిని గొర్రెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగుచేయుడి యని చెప్పుదురు !

5. యోహాను ఆకాశమున పక్షిరాజు ఎగురుచు బూరలు ఊదబడుచున్న శబ్దమును బట్టి భూనివాసులకు అయ్యో అయ్యో అని గొప్ప స్వరముతో చెప్పటవినెను (13వ). యేసు గ్రద్దను యెరూషలేము నాశనమునకు సూచనగా వర్ణించెను (మత్త 24: 28). మొదటినాలుగు బూరలు ఊదబడగా భూమిపై సంభవించు ప్రకృతి విపత్తులను గూర్చి తెలియజేయబడినది. 9వ అధ్యాయములో శ్రమల బూరలను గూర్చి తెలిసికొన బోవుచున్నాము.

**ముగింపు:**

ప్రకటన 8వ అధ్యాయములో ప్రార్థన శక్తిని గూర్చి తెలిసికొన్నాము. నీ ప్రార్థనలు ప్రాముఖ్యం. నీవు ప్రార్థించు నప్పుడు దేవుడు వింటారు. క్రీస్తు నీ కొరకు విజ్ఞాపన చేస్తారు. ఆయన నిన్ను గూర్చిచింతించుచున్నారు. నీ రోదనలను, ఏడ్పును, విజ్ఞాపనలను ఆయన ఆలకించుచున్నారు. మనకు శ్రమలు సంభవిస్తాయి. గాని ఆయనవైపు చూడాలి. తగిన సమయమందు ఆయన ప్రజలకు తీర్పుతీర్చును.

<u>గమనిక</u> : కొందరు ఈ గ్రంథములోని ప్రవచనములు అక్షరార్థముగా నెరవేరునని తలంచెదరు, ఆకాశములో గొప్ప వింతలు జరుగునని వారు భావిస్తారు. ప్రకటన గ్రంథము అట్టివాటిని గూర్చి చెప్పుట లేదు. వారు భూమిలోను, చెట్లలోను మూడవభాగము కాలిపోవువాటిని తలస్తారు. పచ్చని గడ్డి అంతయు కాలిపోవునను కొంటారు. యిది ప్రవచనాత్మక భాషకు సరియైన భావార్థము కాదు. ఈలోకంలో దేవుని క్రియలను గూర్చి మీరు తెలిసికొనాలి. యెషయా 13:10లో బబులోను నాశనంగావించ బడునప్పుడేమి జరుగునో చెప్పబడింది: "ఆకాశ నక్షత్రములు నక్షత్రరాసులను తమ వెలుగు ప్రకాశింపనియ్యవు, ఉదయ కాలమున సూర్యుని చీకటికమ్మును, చంద్రుడు ప్రకాశింపడు".

"సైన్యములకధిపతియగు యెహోవా ఉగ్రతకును ఆయన కోపాగ్ని దినమునకును ఆకాశము వణుకునట్లును భూమి తన స్థానము తప్పునట్లును చేసెదను" (యెషయా 13:13). అక్షరార్థముగా యిది ఎన్నడుజరుగలేదు. బబులోను నాశనం చేయబడింది. ఇంకను నాశనం గావించబడేయున్నది. అయితే దేవుడు ఈలోకానికి తన తీర్పును అమలుపర్చారు. ప్రవక్తలు దానిని ఇవిధంగా వర్ణించారు. మరల ఏదోము నాశనమును గూర్చి యెషయా యిట్లు ప్రవచించాడు. "ఆకాశ సైన్యమంతయు క్షీణించును, కాగితపు చుట్టవలె ఆకాశ వైశాల్యములు చుట్టబడును... వాటి సైన్యమంతయు రాలిపోవును, నిజముగా ఆకాశమందు నా ఖడ్గము ఏదోము మీద తీర్పు తీర్చుటకు... దిగును" (యెషయా 34:4-5). నిజానికి ఏదోము దేశము మీదకు ఆకాశమునుండి ఖడ్గము దిగిరా లేదు. ఆకాశము ఒక చాపవలె నిజంగా చుట్టబడలేదు. గాని ప్రవక్తలు ఈపదజాలములతో వర్ణించిన దేవుని తీర్పు ఏదోము మీదకు వచ్చెను. భూమి మీద ఏదోమీయుడెవడు నేడులేడు, ఆ దేశము ఎప్పుడో గతించిపోయెను.

తనకు అవిధేయులైన వారి మీదికి దేవుడు తన ఉగ్రతను రప్పించును. ప్రజలకు ఆయన తన హెచ్చరికలను తెలియజేసి తీర్పులు పంపించును, మరియు తన ప్రజల మొరలకు స్పందించును. ప్రకటన 8వ అధ్యాయములో జరిగింది నిశ్చయముగా అదే!


**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితముగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపిచవలయును.**

## దాని వేగవంతమైన యభివృద్ధి వలన క్రైస్తవ్యము యదార్థము (Christianity is proven true by its Rapid Growth)

అపొస్తలుల కార్యముల గ్రంథములో క్రైస్తవ్యము యదార్థమని వ్రాయుచు గ్రంథ కర్తయైన లూకా దానియొక్క వేగవంతమైన యభివృద్ధిని గూర్చి వ్రాసాడు. మానవ కల్పిత మతములు అంత త్వరితగతిని వ్యాపించవు అని అతడు వాదించాడు. రోమా ప్రభుత్వపు ఎరుకలో ఉన్న మానవ కల్పిత మతములు చాల మందకొడిగ వ్యాపించాయి. గాని క్రైస్తవ్య మయితే యెరూషలేములో అగ్నిపర్వతమువలె బ్రద్దలై వ్యాపించినది. దైవానుగ్రహము లేనిదే దాని వేగవంతమైన యభివృద్ధి గూర్చి యేమని చెప్పుకొందుము? దాని యభివృద్ధి దైవికవే అయితే దానియందున్న విశ్వాసులు వెూనపోయారని మనం నిందించలేము.

అపొస్తలుల కార్యముల గ్రంథములో ఆరంభములోనే క్రైస్తవ్యము వ్యాప్తి చెందడాన్ని గూర్చి లూకా వ్రాసాడు. పెంతెకొస్తు దినమున "అతని వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు యించుమించు మూడువేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41). "మరియు రక్షణ పొందుచున్న వారిని అనుదినము ప్రభువు వారితో చేర్చుచుండెను" (2:47). ఈ ఉద్యమము ఇట్లు వ్యాప్తిజెందెను. "వాక్యము వినిన వారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య యించుమించు అయిదు వేలు ఆయెను" (4:4). "దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెను; మరియు యాజకులలో అనేకులు విశ్వాసమునకు లోబడిరి" (6:7).

తరువాత క్రైస్తవులు హింసవలన చెదరిపోయిరి. "చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" (8:4). సమరయలో వారు విస్తరించిరి (9:31). యొప్పేలో అనేకులు ప్రభువునందు విశ్వాసముంచిరి (12:24). పిసిదియలోని అంతియొకయలో "ప్రభువు వాక్యము ఆ ప్రదేశమందంతట వ్యాపించెను" (13:49). పౌలు బర్నబాలు సువార్త దండయాత్ర జరిపి వచ్చిన తరువాత అంతియొకయలో నిలిచియుండి అనేకులతో కూడ ప్రభువు వాక్యము బోధించుచు ప్రకటించుచు నుండిరి (15:35).

థెస్సలోనికయలో "భక్తి పరులగు గ్రీసు దేశస్థులలో చాల మందియు ఘనతగల స్త్రీలలో అనేకులును

ఒప్పుకొని పౌలుతోను సీలతోను కలిసికొనిరి'' (17:4). "కొరింథీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి'' (18:8). ఎఫెసులో "ప్రభావముతో ప్రభువు వాక్యము ప్రబలమై వ్యాపించెను" (19:20).

లూకా యొక్క వివరణ, వాదన స్పష్టము. సందేహ శీలులు క్రైస్తవ్యము యొక్క వేగవంతమైన వ్యాప్తిని ఎట్లు కాదన గలరు? మానవకల్పిత మతములు అట్లు విశ్వ వ్యాప్తము కాలేదు గదా? మానవ కల్పిత మతముల కొలబద్దనే మనం క్రైస్తవ్యమునకు వర్తింపజేయలేము. క్రైస్తవ్యము, దాని యభివృద్ధి కేవలం దైవికమే గాని వేరొకటి కాదు. అది మనుష్యుల వలన కలిగినది కాదు.

– రోజర్ డిక్సన్

# బైబిలును నీవు నమ్మవచ్చు
# (You Can Trust The Bible)

మనకు నేడు లభ్యమగుచున్న బైబిలును నమ్మవచ్చునో లేదో యని కొందరు శంకించుదురు. "గత కాలములలో బైబిలును మార్చలేదని మనం ఎట్లెరుగుదుము''? అని వారంటారు బహుశా నీవు కూడ అట్లే తలంచి యుండవచ్చుగాని బైబిలును మనం నమ్మవచ్చు.

మొదటిగా, బైబిలు దైవావేశము వలన కలిగినదని తనకుతానే చెప్పుకొనుచున్నది. భక్తిగల జనులు దానిని తయారు చేయలేదు. ప్రతి లేఖనము దైవావేశము వలన కలిగెనని అపొ. పౌలు చెప్పాడు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగి ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3:16-17). యేసు తన శిష్యులతో "మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడుచున్నాడే గాని మాటలాడువారు మీరు కారు" అని చెప్పెను (మత్తయి 10:20). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగ పలికిరి" యని అపొ. పేతురు నుడివెను (2 పేతురు 1:21).

రెండవదిగా, మూడవ శతాబ్దములో వ్రాయబడిన పురాతన ప్రతులు శతాబ్దములు గడచినను మార్పులేనివై యున్నవి. కొన్ని స్వల్ప మార్పులు వాటిలో యున్నాయి, నిజమే, అవి అక్షర దోషములు, కొన్ని పదములే

కనబడక పోవుట యనునవి. అయినను అవి అతి స్వల్పమైనవే, సరిగదా ఆ వచనములోని భావార్థమును అవి ఏ మాత్రము మార్చలేదు. యిది ఆశ్చర్యం.

మూడవదిగా, బైబిలు పుటలలో జీవితాన్ని మార్చే వర్తమానమున్నది గనుక దానిని నమ్మవచ్చును. అది విశ్వాసము, నిరీక్షణ, సంతోషము, శాంతి, రక్షణ మన కనుగ్రహించుచున్నది. తుఫానులలో అది మనకు ఆశ్రయమిచ్చును, అలసిన వారి కది శక్తినిచ్చును. ఆంధకారములో యున్నవారికి వెలుగునిచ్చును. శతాబ్దాల తరబడి బైబిలు కోట్లాది ప్రజలకు సహాయము చేసినది. వారు హింసలను, శ్రమలను, భాధలను సహించి జయించునట్లు సహాయ పడింది. జయజీవితమునకు వారిని నడిపింది. నీవుకూడ బైబిలు నుండి శక్తిని జ్ఞానమును, వివేకమును సంపాదించ వచ్చును. దాన్ని చదువుము,ధ్యానించుము, దానికి లోబడుము.

– సాల్వడోర్ కరియాగ.

----0----

# బైబిలును ఎందుకు నమ్ముచున్నానంటే...? (Why I believe The Bible)

కొందరు బైబిలును నమ్మరు. బహుశ బైబిలుకు భిన్నమైన వేదాంతాన్ని వారు అనుసరించుచున్నారు. కొందరు దానిని గూర్చి ఎరుగకయున్నారు. మరికొందరు దానిని గూర్చి భిన్నమైన భావాలను విన్నారు.

అరువదిఆరు పుస్తకాలు సంపుటియై బైబిలు సాటిలేని ఒక గ్రంధమైయున్నది. అది దేవుడు చేసిన సృష్టి కధతో ఆరంభమై మానవ చరిత్ర కథ అంతముతో ముగియుచున్నది. బైబిలును నేను నమ్ముటకు కారణములు అనేకములున్నాయి.

1. బైబిలు ఇంకాయున్నది (The Bible Exists). యితర పురాతన గ్రంధాలు కూడా నేడున్నాయి, నిజమే గాని బైబిలు దగ్గర అవి కొరగానివి.

2. బైబిలు చెప్పిన సంఘటనలు, ప్రజలు ప్రదేశాలు వాస్తవమని మనం ఎరుగుదుము. అది పురాణముల వలె కట్టు కథలు చెప్పదు.

3. బైబిలులో అద్భుతమైన సమైక్యత యున్నది. దానిని అనేకులు 1600 సంవత్సరముల కాలములో వ్రాసినను గొప్ప ఏకత్వముఅందులో యున్నది.

4. బైబిలు భవిష్యత్ సంఘటనలను ఖచ్చితంగా చెప్పుచున్నది. పరిశుద్ధాత్మ పర్యవేక్షణ లేకుండా అవి అట్లు లిఖింపబడి యుండలేదు. మెస్సీయ యొక్క శ్రమలను యెషయా విపులంగా చిత్రీకరించాడు. అందుకు కారణాలను వివరించాడు (యెషయా 53). " ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు" ఒక రాజ్యమును స్థాపించును. దాని కెన్నటికి నాశనము కలుగదు అని దానియేలు లిఖించాడు (దానియేలు 2:44).

5. యేసును ఎరిగినవారు ఆయనే మానవజాతి రక్షకుడని విశ్వసించారు. పరిశుద్ధాత్మావేశము వలన వారు క్రొత్తనింబధన గ్రంథాన్ని లిఖించారు. సమాధి చేయబడిన తరువాత యేసు మరణం జయించి తిరిగి లేచారని వారు విశ్వసించారు. ఆయన కొరకు, ఆయన వర్తమానము కొరకు వారు తమ జీవితాలను ఇష్టపూర్వకంగా సమర్పించారు. సత్యం, అసత్యముల మధ్యనున్న భేదాన్ని ఎరిగి యుండిన వివేకులువారు.

"కాబట్టి యేసు, తనను నమ్మిన యూదులతో – మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించెదరు; అపుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయునని చెప్పెను" (యోహాను 8:31-32).

నేటి లోకము యదార్ధము. మోసములపై తిరుగులాడుచున్నది. ఏది నిజము యేది అబద్ధము? అని ప్రజలు ఆలోచించుచున్నారు. నేనొక టీ.వి ప్రకటనను చూచాను. అందులో ఒక మనుష్యునికి తాను కొనే ప్రతి వస్తువు ఏదో ఒక దాని లో నకిలీదిలా కనబడేది. అంటే ఆ వస్తువు యదార్ధమైనది. అసలైనది కాదు. అయితే కొన్ని వస్తువులు అవి కనబడుచున్న రీతిగా మంచివే. వాటిని కొన్నవాడు మోసగించబడడు. దేవుని వాక్యమునకు ఆ ఉదాహరణ సరియైనది. అనేకులు తమ జీవితాన్ని గూర్చి సందిగ్ధంలో యున్నారు. వారనుకొన్న రీతిలో వారిజీవితం సాగడం లేదు, చాలా సందర్భములలో తాము పాఠమును నేర్చుకొనక ముందే వారి జీవితాలు నాశనమయ్యాయి.

పిలాతు అట్టి పరిస్థితిలో యుండిన వారికి గొప్ప ఉదాహరణ. "నీవు రాజువా"? అని అతడు యేసునడినాడు, "యేసు నీవన్నట్టే నేను రాజునే; సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకు నేను పుట్టితిని; ఇందుకు నిమిత్తమే ఈ లోకమునకు వచ్చితిని; సత్యసంబంధియైన ప్రతి వాడును నా మాట వినుననెను,అందుకు పిలాతు సత్యమనగా యేమిటి"? అని ఆయనతో చెప్పెను (యోహాను 18:37-38).

సత్యమనగా యేమిటో గ్రహించుకోలేని పరిస్థితిలో పిలాతు ఇక్కడ మనకు కనబడుచున్నాడు. తన జీవితమంతా అతడు ఒకే విధంగా జీవించాడు. యూదుల మధ్య అతడు ఎక్కువ కాలం గడిపాడు గనుక వారి మతమును గూర్చి అతడు విన్నాడు. అందుకే "సత్యమునగా యేమిటి"? అనే ప్రశ్న వేసాడు.

అతని గూర్చిన విచారం యేమంటే, అతడు చేతులు కడిగివేసుకొని తన బాధ్యతను వదిలించు కొనదలచాడు. అతడింతవరకు ఎట్లు జీవించాడో అట్లే యుండగోరాడు. దాని పర్యవసానం విషయంలో నిర్లక్ష్యం చూపించాడు. యిట్టి పరిస్థితిలో అనేకమంది జీవించడం విచారం. వారు సత్యమును వెదకాలి, కనుగొనాలి.

"నీ వాక్యసారాంశము సత్యము, నీవు నియమించిన న్యాయవిధులన్నియు నిత్యము నిలుచునని" కీర్తనకారుడు వ్రాసాడు (కీర్తన 119:160). యోహాను 17:17లో యేసు "సత్యమందు వారిని ప్రతిష్ఠ చేయుము; నీ వాక్యమే సత్యము" అని చెప్పారు. గనుక దేవునిలో ప్రతిష్ఠంపబడి యుండాలంటే మనం సత్యము నెరుగాలి, సత్యములో యుండాలి, ఆ సత్యమే ఆయన వాక్యము.

సత్యమును వెదకువారికి యేసుక్రీస్తు వాక్యమే యదార్థమయిన రక్షణ మార్గము. మనం ఆయన చిత్తాన్ని జరిగించాలని యేసు బోధించుచున్నారు. "ప్రభువా ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోక మందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును " అని ఆయన చెప్పెను (మత్తయి 7:21).

- టోని లల్లి

# సంఘము ప్రాముఖ్యమైనది
## (The church is important)

క్రీస్తుకు చెందిన సంఘము చాల ప్రాముఖ్యమైనది. దాని యొక్క ప్రాముఖ్యతను నీవు గమనించుట అత్యవసరం.

సంఘము ప్రాముఖ్యమైనదని మనకేలాగు తెలియను? ఏలయనగా క్రీస్తు తన స్వరక్త మిచ్చి సంఘమును కొనెను (అపొ.కా. 20:28). నీ రక్తము నీకెంత ప్రాముఖ్యము? నీయింటి కంటె అది ముఖ్యమా? నీకున్న డబ్బు అంతటి కంటె అది విలువైనదా? నీ ఉద్యోగము కంటె అది విలువైనదా? క్రీస్తు రక్తము

ఆయన కెంత విలువైనది? దానికి నీవు జవాబిస్తే క్రీస్తుకు సంఘము ఎంత విలువైనదో గ్రహించకోగలవు. ఏలయనగా సంఘము కొరకు ఆయన తన స్వంత రక్తము నిచ్చారు! నీ రక్తమును సంఘము కొరకు ఇయ్యవలసి వస్తే సంఘము నీ కంత ప్రాముఖ్యమని రుజువగునా? లేక సంఘము అంత ప్రాముఖ్యము కాదని మోసగించబడ్డావా?


క్రీస్తు సంఘమునకు రక్షకుడు గనుక సంఘము ప్రాముఖ్యము (ఎఫెసీ 5:23). క్రీస్తు నీకు నిత్య రక్షకుడు కావాలని కోరుకొనుచున్నావా? (హెబ్రీ 13:20). మరణ పర్యంతము క్రీస్తుకు నమ్మకమైన సభ్యుడువుగా యుండాలనుకొను చున్నావా? (ప్రకటన 2:10). క్రీస్తు నిన్ను రక్షించాలంటే ఆయన సంఘ సభ్యుడవై యుండాలి గనుక సంఘము నీకు కూడ చాలా ప్రాముఖ్యమే (అపొ.కా. 2:38-47; 1పేతురు 1:10).

సంఘము క్రీస్తు శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది గనుక ప్రాముఖ్యమైనది. (ఎఫెసీ 1:23). ఆయన మానవుల కేమి చేయాలనుకొన్నా దానిని సంఘము ద్వారానే చేయును (ఎఫెసీ 3:-14-19; ఫిలిప్పీ 1:9-11). సంపూర్ణతను సంపాదించడానికి మనం సంఘములో యుండాలి. ఏలయనగా క్రీస్తు సంఘము యొక్క సంపూర్ణతయై యున్నారు.

సంఘము క్రీస్తు యొక్క శరీరమై యున్నది; క్రీస్తే దానికి శిరస్సు (కొలస్స 1:18). గనుక సంఘము ప్రాముఖ్యము. శిరస్సు నుండి వేరైన శరీరాన్ని మనం చూడలేము. నీ శిరస్సుకు నీ శరీరము ప్రాముఖ్యమా? నీ శరీరముకు శిరస్సు ముఖ్యమా? అట్లే సంఘముకు క్రీస్తుకూడాను!

సంఘముప్రాముఖ్యము కాదంటే, అది రక్తము లేని శరీరము వలెయుండును. రక్తహీనమైన శరీరం చూడ ముచ్చటగాయుండదు. సంఘము కొరకు క్రీస్తు తన రక్తాన్ని యిచ్చినందున, ఆయన శరీరమైన సంఘము నుండి ఆయన రక్తాని మనం బయటకు తీయలేము. సంఘము అంత ప్రాముఖ్యమైనది. సంఘము ప్రాముఖ్యము కాకపోతే క్రీస్తు రాజ్యములేని రాజు శరీరములేని శిరస్సు, తీగెలులేని ద్రాక్షా వల్లి, గొర్రెలు లేని కాపరి, రక్తము లేని శరీరం అవుతారు. అట్టి తలంపులు భయంకరం, నీ ఆలోచనలలో సంఘము యొక్క ప్రాముఖ్యతను గుర్తించావా?

– డేటన్ కిస్సీ.



## చదువరులకు విజ్ఞప్తి

సత్యవాక్కు మాసపత్రిక గత 27 సంవత్సరాల నుండి నిర్విఘ్నముగా దేవుని కృపవలన కొనసాగుచున్నది. 2007 ఆగష్టు నెలలో అది 28వ సంవత్సములో ప్రవేశించును. ప్రస్తుతము అది 11,000 గృహాలను దర్శించుచున్నది. అయితే అది ఇప్పుడు గొప్ప ఆర్థిక సమస్యలను ఎదుర్కొనుచున్నది. కొందరు తలంచుచున్న రీతిగా ఈ పత్రికకు విదేశీ సహాయం యేమీలేదు. యిది ప్రభుత్వము వారిచే రిజిష్టర్ చేయబడిన మాసపత్రిక గనుక విదేశీధనం దీని ప్రచురణలో యేమీ వాడకూడదు, వాడుటకూడ జరుగదు. అది చట్టవిరుద్ధం. ఇంతకాలం అది కేవలం భారతీయుల సహాయసహకారాలతో కొనసాగుచున్నది. అయితే 2007 ఆగష్టు నెలాఖరులోగా 50/- రూపాయలు గాని అంతకు ఎక్కువగాని మీరు సత్యవాక్కుకు కానుక పంపకపోతే సత్యవాక్కు మీకు అందజేయలేము. గనుక దీనిని గమనించగోర్తాము. భవిష్యత్తులో సత్యవాక్యు ప్రతినెలా క్రమముగా పొందగోరుచున్న వారు మీ కానుకను ఆగష్టు ఆఖరులోగా దిగువ చిరునామాకు **M.O** చేయండి. **M.O** ఫారం మీద మీ అడ్రసు, సత్యవాక్కు లేబిల్ మీద యున్న మీ నంబరు తప్పక వ్రాయండి. మీ కానుకలు పంపవలసిన చిరునామా:


# *SATYA VAKKU*

*7-9-35, SAMBAMURTHY STREET,*
*KAKINADA - 533 004*
*PH : 0884 - 2363722.*

# సత్యవాణి సంగీతమాలిక
# Vol 5 and 6
## ఇప్పుడు లభించుచున్నవి.

మీరు సత్యవాణి రేడియో, T.V కార్యక్రమములలో వినుచున్న ఆహ్లాదకరమైన పాటల కేసెట్లు మొత్తం 6 వాల్యూమ్స్ లభించుచున్నవి. ఆరు కేసెట్లులోను 72 పాతక్రొత్త పాటలు చక్కటి సాంకేతిక పరిజ్ఞానంతో మంచి గాయనీయకులతో రికార్డు చేయబడినవి. ఆరు కేసెట్లుకు 200/-రూ॥లు మాకు పంపవలెను. లేదా 2 కేసెట్లు చొప్పున 65/- రూ॥లు మాకు పంపిచాలి. మీ MO అందగానే మీకు కేసెట్లును అందజేయగలము.

సత్యవాణి
7-9-35, సాంబమూర్తివీధి,
కాకినాడ - 533 004.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004